




అమాత్యయోగం ఎవరికో?

సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు సునామీ సృష్టించారు. గెలుపు కిక్ నుంచి ఇంకా శ్రేణులు బయటికి రాలేదు. అయితే ఇంతలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు అవుతున్నాయి. మోదీ మూడోసారి ఆదివారం ప్రమాణ స్వీకారం చేస్తుండగా.. ఈనెల 12వ తేదీ బుధవారం చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అదేరోజు కానీ, తరువాత కానీ మంత్రివర్గం కొలువుదీరనుంది. ఈ నేపథ్యంలో అమాత్యయోగం ఎవరికి దక్కుతుందో అంటూ జిల్లాలో చర్చ జరుగుతోంది.

- ఉమ్మడి జిల్లాలో ఏడుగురు ఎమ్మెల్యేలు ఎన్నిక
- పొరుగు జిల్లాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలుగా మనోళ్లు
- మంత్రివర్గంలో చోటు కోసం యత్నాలు



(కడప-ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలకు గాను ఏడుచోట్ల కూటమి అభ్యర్థులు గెలుపొందారు. ఇక అనకాపల్లి, ఏలూరు ఎంపీలుగా సీఎం రమేశ్, పుట్టా మహేశ్‌యాదవ్ గెలిచారు. ధర్మవరం ఎమ్మెల్యేగా జిల్లావాసి సత్యకుమార్ గెలిచారు. అయితే కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గంలో ఎవరికి చోటు దక్కుతుందనే ఆసక్తి అందరిలో నెలకొంది. ఎందుకంటే అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో మనోళ్ల పేర్లే చర్చకు వస్తున్నాయి. సామాజిక వర్గాల ఆధారంగా మంత్రివర్గం కూర్పు ఉంటుంది. అన్నివర్గాలకు మంత్రివర్గంలో సమప్రాధాన్యం ఉంటుంది. దీంతో ఆయా వర్గాల్లో ఇప్పుడు ఎవరికి పదవి వస్తుందనే చర్చ నడుస్తోంది.

కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, రాయచోటి నుంచి ఎమ్మెల్యేలు మాధవీరెడ్డి, పుత్తా చైతన్యరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, ఎస్.వరదరాజులరెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి టీడీపీ తరఫున గెలిచారు. ఇక జమ్మలమడుగు నుంచి ఆదినారాయణరెడ్డి బీజేపీ తరఫున, రైల్వేకోడూరు నుంచి అరవ శ్రీధర్ జనసేన తరఫున గెలిచారు. వీరంతా మంత్రివర్గంలో చోటు సంపాదించేందుకు ఎవరి ప్రయత్నాలు వారు మొదలుపెట్టారు.

ఉమ్మడి కడప జగన్ సొంత జిల్లా. 2004 తరువాత వరుసగా నాలుగుదఫాలుగా జరిగిన ఎన్నికల్లో టీడీపీ గెలుపు రుచి చూడని నియోజకవర్గాలున్నాయి. ఈసారి కూటమి అభ్యర్థులు ఏడుగురు గెలిచి మళ్లీ 1999 ముందునాటి పరిస్థితులు రావడంతో టీడీపీకి పూర్వవైభవం వచ్చింది. జగన్ సొంత జిల్లాలోనే కూటమి అభ్యర్థులు అనూహ్య విజయం సాధించారు. దీంతో కూటమి ఇక్కడ మరింత పటిష్ఠమయ్యేందుకు మంత్రివర్గ విస్తరణలో పదవులు దక్కుతాయని అంటున్నారు. అయితే ఎవరెవరికి దక్కుతాయనే చర్చ నడుస్తోంది. మంత్రివర్గంలో రకరకాల పేర్లు వినిపిస్తున్నాయి. ఒకసారి గెలిచిన ఎమ్మెల్యేల గురించి పరిశీలిస్తే..

- కడప అసెంబ్లీ చరిత్రలోనే మహిళ ఎమ్మెల్యేగా గెలవడం ఇదే మొదటిసారి. టీడీపీ నుంచి బరిలో దిగిన ఆర్.మాధవీరెడ్డి మొట్టమొదటిగా గెలిచి చరిత్ర సృష్టించారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి సతీమణి అయిన ఈమె తక్కువ సమయంలోనే జనాల్లోకి బాగా వెళ్లారు. ఆమె ముక్కుసూటితనం, దూకుడు ప్రవర్తన టీడీపీ శ్రేణులను ఆకర్షించింది. మహిళ కావడంతో ఈమె పేరు కూడా ప్రచారంలో ఉంది.
- ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆరోసారి ఎన్నికయ్యారు. జిల్లాలో చాలా సీనియర్ ఎమ్మెల్యే ఆయన. ఇంతవరకు ఏ ప్రభుత్వంలోనూ ప్రొద్దుటూరు నుంచి మంత్రివర్గంలో ఎవ్వరికీ స్థానం లభించలేదు. సీనియర్ నేత కావడంతో ఆయనకు ఈసారి అవకాశం ఉంటుందని ఆయన వర్గీయులు భావిస్తున్నారు
- కమలాపురం ఎమ్మెల్యేగా పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తొలిసారి ఎన్నికల్లోనే గెలిచి సత్తా చాటారు. యువకుడు, విద్యావంతుడు కావడం, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌తో బాగా డీలింగ్స్ ఉండడంతో మంత్రిపదవిపై ఆయన వర్గీయులు ఆశలు పెట్టుకుని ఉన్నారు.
- మైదుకూరు ఎమ్మెల్యేగా పుట్టా సుధాకర్‌యాదవ్ మొట్టమొదటిసారిగా గెలిచారు. 2014, 2019 ఎన్నికల్లో పుట్టా సుధాకర్‌యాదవ్ ఓడిపోయారు. 2014లో టీడీపీ అధికారం చేపట్టడంతో ఈయన తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా పనిచేశారు. బీసీ వర్గానికి చెందినవారు కావడంతో ఈయన అనుచరులు మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు.
- రాయచోటిలో టీడీపీ ఎమ్మెల్యేగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గెలుపొందారు. నియోజకవర్గం ఏర్పడిన తరువాత 1999, 2004 ఎన్నికల్లో మాత్రమే టీడీపీ నుంచి ఎస్.పాలకొండ్రాయుడు గెలిచారు. ఇక 2009 నుంచి 2019 వరకు కాంగ్రెస్, వైసీపీలే గెలుస్తూ వచ్చాయి. అయితే ఈసారి మండిపల్లి రాంప్రసాదరెడ్డి గెలిచారు. ఉమ్మడి జిల్లా అయినా ప్రస్తుతానికి అది రాయచోటి అన్నమయ్య జిల్లా హెడ్‌క్వార్టర్. మంత్రి పదవిపై ఆయన ఆశలు పెట్టుకుని ఉన్నారు.
- రైల్వేకోడూరు ఒకప్పుడు టీడీపీకి కంచుకోట. ఇక్కడ టీడీపీ నుంచి చివరిసారిగా 1999లో ఎస్.సరస్వతి గెలుపొంది అప్పటి చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. తరువాత వరుస ఎన్నికల్లో కాంగ్రెస్, వైసీపీ గెలుస్తూ వచ్చాయి. కూటమిలో భాగంగా ఈ టికెట్‌ను జనసేనకు కేటాయించారు. అరవ శ్రీధర్ గెలుపొందారు ఇది ఎస్సీ నియోజకవర్గం. ఇక రాష్ట్ర మంత్రివర్గంలో జనసేన చేరుతుంది. సామాజిక వర్గాల కూర్పు ప్రకారం మంత్రి పదవిపై ఇక్కడ జనసేన వర్గాలు ఆశలు పెట్టుకుని ఉన్నాయి.
- జమ్మలమడుగులో ఆదినారాయణరెడ్డి మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014 ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలిచిన ఆయన తరువాత టీడీపీలో చేరి మంత్రి అయ్యారు. ఇప్పుడు బీజేపీలో ఉన్నారు. బీజేపీ కోటాలో మంత్రివర్గంలో అవకాశం ఉంటుందని ఆయన వర్గీయులు ఆశిస్తున్నారు.

ఎవరి ప్రయత్నాల్లో వారు

మంత్రివర్గంపై ఆశలు పెట్టుకున్న ఎమ్మెల్యే, ఎంపీలు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. జిల్లా నుంచి ఎన్నికైన టీడీపీ ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా ఇప్పటికే కొందరు టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్‌ను కలిశారు. ఇక బీజేపీ అభ్యర్థి ఆదినారాయణరెడ్డి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ ఢిల్లీ పెద్దలను కలిసేందుకు వెళ్లారు. ఇలా ఎవరికి వారు మంత్రివర్గంలో చోటుపై ప్రయత్నాలు చేస్తుండడంతో.. ఉమ్మడి జిల్లాలో ఎవరికి పదవి దక్కుతుందోనన్న చర్చ బాగా నడుస్తోంది.

పొరుగు జిల్లాలో మనోళ్లు

ప్రొద్దుటూరుకు చెందిన సత్యకుమార్ ధర్మవరం నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచారు. ఈయనకు జాతీయ స్థాయిలో బీజేపీ పెద్దలు, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులతో సంబంధాలున్నాయంటారు. బీసీ వర్గానికి చెందిన నేత కావడంతో మంత్రి పదవిపై ఆయన అనుచరవర్గం ఆశలు పెట్టుకుని ఉన్నారు.

పోట్లదుర్తికి చెందిన సీఎం రమేశ్ అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా గెలుపొందారు. కేంద్ర మంత్రివర్గంలో ఈయనకు చోటు లభిస్తుందని ఈయన వర్గీయులు భావిస్తున్నారు. కేంద్రంలో ఈయనకు విస్తృత సంబంధాలు ఉన్నట్లు ప్రచారం ఉండడంతో ఈయన పేరు కూడా ప్రచారంలో ఉంది. ఇక మైదుకూరుకు చెందిన పుట్టా మహేశ్‌కుమార్‌యాదవ్ ఏలూరు నుంచి తొలిసారిగా ఎంపీగా ఎన్నికయ్యారు. ఏమో గుర్రం ఎగురుతుందేమోనన్న ఆశ ఆయన వర్గీయుల్లో ఉంది. ఇక పులివెందులకు చెందని భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికై రాయలసీమలోని టీడీపీలో ఊపు తెచ్చారు. ఈయన కూడా మంత్రి పదవిపై ఆశతో ఉన్నారని ప్రచారం జరుగుతోంది.

ఊడుతున్న నామినేటెడ్ పదవులు

- సహకారశాఖలో చర్యలకు ఉపక్రమించిన యంత్రాంగం
- రాజీనామా పత్రాలు తీసుకుంటున్న అధికారులు



నాగిరెడ్డిపల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం త్రిసభ్య పర్సన్ ఇన్‌చార్జి కమిటీ అధ్యక్షుడు రాజారెడ్డి నుంచి రాజీనామా పత్రాన్ని తీసుకుంటున్న అధికారి

కడప(రూరల్) జూన్ 8: రాష్ట్రంలో ఎన్డీయే కూటమి చేతిలో వైసీపీ చిత్తుచిత్తుగా ఓడిపోయింది. 175 అసెంబ్లీ స్థానాలకు గాను 11 స్థానాలలో మాత్రమే వైసీపీ నెగ్గి ప్రతిపక్ష హోదాను కూడా దక్కించుకోలేదు. 12వ తేదీన కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. రాష్ట్ర చీఫ్ సెక్రటరీ(సీఎస్)గా నీరబ్ కుమార్ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన నామినేటెడ్ పదవులన్నీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ప్రభుత్వ, ప్రభుత్వేతర అనుబంధ సంస్థలకు గత వైసీపీ ప్రభుత్వం నామినేటెడ్ ద్వారా ఏర్పాటుచేసిన పాలకవర్గాలు తప్పుకోవాల్సి వచ్చింది. వీరిలో ఇప్పటికే కొంతమంది రాజీనామాలు సమర్పించారు. చేయనివారి వద్ద నుంచి రాజీనామాలు తీసుకుంటున్నారు. హౌసింగ్, ఆర్టీసీ, ఉపాధిహామీ పథకం, దేవదాయశాఖ, జిల్లా సహకారశాఖ, లిడ్‌క్యాప్, సాంఘికసంక్షేమశాఖ తదితర శాఖలతో పాటు ఆయా కులసంఘాల కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు వారి పదవులకు రాజీనామా చేయాల్సి వచ్చింది. శనివారం జిల్లాలోని ఆయా ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల త్రిసభ్య పర్సన్ ఇన్‌చార్జి కమిటీగా బాధ్యతలు చేపడుతున్న వారి నుంచి రాజీనామా పత్రాలను తీసుకున్నారు. కాగా ఉన్నత పదవులలో ఉన్న కడప జిల్లా కేంద్రసహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్‌పర్సన్, డీసీఎంఎస్ చైర్‌పర్సన్లు, అందులోని డైరెక్టర్లు మాత్రం శనివారం సాయంత్రం వరకు రాజీనామా చేయలేదు.

ఏళ్ల తరబడి అంటిపెట్టుకున్న వైసీపీ నేతలు

2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అదే ఏడాది జూలై 31వ తేదీన పీఏ సీఎస్‌లకు వైసీపీ నాయకులను త్రీమెన్ కమిటీ పేరుతో పాలకవర్గాలను నియమించింది. ఈమేరకు సహకారశాఖ పరిధిలోని డీసీసీబీ, డీసీఎంఎస్, సహకార సొసైటీలలో నామినేటెడ్ రూపంలో పదవులను దక్కించుకున్నవారు 2024 జూన్ 4 వరకు పొడిగించుకుంటూ వచ్చారు. ఇలా ఏళ్ల తరబడి ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పదవులను అంటిపెట్టుకొని ఉన్న వారు ఇప్పుడు ఉన్నఫలంగా పదవులు కోల్పోవాల్సి రావడంతో ఆవేదన చెందుతున్నారు. అయితే సాధారణ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోగానే కొందరు రాజీనామా చేశారు. మిగిలిన వారు పదవులకు రాజీనామా చేయకుండా కొత్త ప్రభుత్వ నిర్ణయం వచ్చేవరకు అంటిపెట్టుకుని ఉండాలనుకున్నారు. అయితే కొత్త సీఎస్ తాజా నిర్ణయంతో వారంతా ఖంగుతిన్నారు. ఈవ్యవహారంపై జిల్లా సహకారశాఖ అధికారి సుభాషిణిని వివరణ కోరగా.. జిల్లా సహకారశాఖకు చెందిన పలు విభాగాలలో నామినేటెడ్ పదవులలో ఉన్న వారినుంచి రాజీనామా పత్రాలను తీసుకుంటున్నామని అన్నారు. శనివారం జిల్లాలోని ఆయా ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల త్రిసభ్య పర్సన్ ఇన్‌చార్జి కమిటీ బాధ్యతలు చేపడుతున్న వారి నుంచి రాజీనామా పత్రాలను సంబంధిత అధికారులు తీసుకున్నారని చెప్పారు.

పాపం సారు..!

- మళ్లీ వైసీపీ గెలుస్తుందంటూ అభ్యర్థులకు పార్టీ ఫండింగ్
- కడపలో రూ.1.50 కోట్లు, కర్నూలులో కోటి..
- వైసీపీ ఓటమితో సార్ డీలా
- ఆ సార్‌పై ఉద్యోగుల్లో చర్చ



(కడప-ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు చెందిన ఓ అధికారిపై ఇపుడు ఆ శాఖలో పెద్ద చర్చే నడుస్తోంది. సార్ నిక్కచ్చిగా డ్యూటీ చేస్తారా.. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపడంలో కింగా అనుకుంటే పప్పులో కాలేసినట్లే. ఎందుకంటే ఆ సారు వైసీపీకి వీరభక్తుడు. ఎంతంటే ఆయన సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు అభ్యర్థులకు ఎన్నికల్లో సుమారు రూ.2.5కోట్లకు పైగా ఫండింగ్ ఇచ్చారంట. మళ్లీ గెలిచేది వైసీపీనే.. నాదే రాజ్యం అనుకొని వ్యాపారులు ఇతరుల వద్ద వసూలు చేసిన డబ్బులు వైసీపీ గెలుపునకు ఫండింగ్ ఇచ్చారంటారు. కానీ జనం వైసీపీ ఫ్యాన్ రెక్కలు విరిచేశారు. ఫండింగ్ తీసుకున్న అభ్యర్థులు ఓడిపోయారు. దీంతో సారు బాగా డీలా పడిపోయారంట. ఆ శాఖలో మాసారు పరిస్థితి ఏంటి ఇలా రివర్స్ అయిందంటూ చర్చించుకోవడం హాట్ టాపిక్‌గా మారిందంటారు.

ఉమ్మడి జిల్లాలో ఆయన పనిచేశారు. ఇపుడు మళ్లీ విజిలెన్స్‌లో పనిచేస్తున్నారు. కడప, అన్నమయ్య జిల్లాలకు విజిలెన్స్ పనిచేస్తోంది. ఆయన వైసీపీకి అనుకూలంగా ఉంటారనే విమర్శ ఉంది. పైస్థాయి నుంచి టార్గెట్ వచ్చినపుడు తప్ప మిగిలిన సమయంలో ఆ విభాగం తనిఖీలు చేయదని అంటారు. ఇక కడప జిల్లాకు చెందిన ఆయనకు తన సామాజిక వర్గానికి చెందిన వైసీపీ నేతలతో సంబంధాలు ఉన్నాయంటారు. ఆయన ఓ ఎమ్మెల్యే అభ్యర్థికి ఎన్నికల్లో డబ్బు సాయం చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ ఎమ్మెల్యే బాగా సంపాదించారనే పేరుంది. భూకబ్జాలు, సెటిల్‌మెంట్లలో ఆయన ఆరితేరారు. అలాంటి వ్యక్తికి ఈసారు ఎన్నికల్లో ఉడతాభక్తి సాయంగా రూ.1.50కోట్ల ఫండింగ్ ఇచ్చారు. అంతే కాదు.. తన సామాజిక వర్గానికి చందిన ఒకాయన కర్నూలు జిల్లాలో ఎమ్మెల్యేగా పోటీ చేస్తే అయనకు కూడా రూ.కోటి ఫండింగ్ ఇచ్చారు. కడప జిల్లాలో గతంలో ఓ డివిజన్ ఆఫీసులో పనిచేసిన ఓ అధికారి కూడా ఫండింగ్ ఇచ్చారని విజిలెన్స్‌లో కోడైకూస్తోంది. మళ్లీ వచ్చేది వైసీపీనే.. వీళ్ల ఆశీస్సులు ఉంటే కడపలోనే ఉండచ్చు. ఒకవేళ తేడాకొడితే కర్నూలు జిల్లాలో ఫండింగ్ ఇచ్చిన ఎమ్మెల్యే సహాయ సహకారాలు అందిస్తారని భావించారు. ఈ వ్యవహారంలో కడప జిల్లాలో రెవెన్యూ డివిజనల్ ఆఫీస్‌లో పనిచేసిన ఒకాయన కీలకంగా వ్యవహరించారు. ఆయన ఆశీస్సులతో మళ్లీ ఇక్కడే ఉండచ్చనే ఉద్దేశంతో ఫండింగ్ ఇచ్చారని చర్చ నడుస్తోంది. అయితే ఎన్నికల ఫలితాలు చూసి సారు ఖంగుతిన్నారంటారు. ఇదేంటి మళ్లీ జగనే సీఎం అనుకుంటే జనం వైసీపీని ఈడ్చికొట్టారని సార్ చాలా మదనపడుతున్నట్లు చెబుతారు. సార్‌కు సొంత సామాజిక వర్గం మీద బాగా అభిమానం అంటారు. ఆశాఖలో సుమారు సగం మంది అధికారులు ఆయన వర్గానికి చెందిన వారే ఉంటారంటారు. అందుకే ఫండింగ్ కూడా ఆయన వర్గానికే చెందినవాళ్లకే ఇచ్చారని విజిలెన్స్‌లో చర్చ నడుస్తోంది. పాపం.. సార్ ఫండింగ్ ఇచ్చిన ఇద్దరు అస్సాం పోతే, మరి ఆ సారును ఎవరు కాపాడుతారంటూ ఆ శాఖలో చర్చ నడుస్తోంది.

ఎన్నేళ్లిలా..?

అది రాయలసీమకే తలమానికమైన ప్రభుత్వ రంగ సంస్థ. ప్రజలకు వెలుగునిచ్చే విద్యుత్ ప్లాంటు. సుమారు రూ.20వేల కోట్ల విలువచేసే భారీ పరిశ్రమ. కానీ.. భారీ వాహనాలు ఎటువైపు నుంచి వెళ్లాలన్నా సరైన రోడ్డు సౌకర్యం మాత్రం శూన్యం. ఎప్పుడూ మోకాటి లోతు గుంతలు, పూర్తిగా ధ్వంసమైన రోడ్డే దర్శనమిస్తోంది. అదే డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంటు (ఆర్టీపీపీ). పాలకులు తమకు నచ్చితే అది ప్రైవేటు సంస్థ అయినా సరే.. వెంటనే వాటికి వెంటనే అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రైవేటుపై ఉన్నశ్రద్ధ ప్రజలకు సంబంధించిన ప్రభుత్వ రంగ సంస్థపై మాత్రం లేదు.



గుంతలమయమైన రోడ్డు

ఎర్రగుంట్ల, జూన్ 8: ఆర్టీపీపీ దాదాపు.. ప్రస్తుతం 1650మెగావాట్ల సామర్థ్యంతో విద్యుదుత్పత్తిని సాధిస్తోంది. ఈ ప్లాంటు నిర్మాణ సమయంలో మొన్నటివరకు భారీ నుంచి అతిభారీ యంత్రాలు దేశ నలుమూల నుంచి ఇక్కడకు వచ్చేవి. కానీ అవి ఆర్టీపీపీకి చేరేందుకు ముద్దనూరు రోడ్డు నుంచి, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల నుంచి సరైన రోడ్డు మార్గం లేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. మలుపుల్లో తిరగలేక వారాల తరబడి ప్లాంటుకు సమీపంలోనే ఆగిపోవాల్సిన పరిస్థితి ఉంది. ఈ మార్గం గుండా ఫ్లైయాష్ తీసుకెళ్లే వాహనాలు ఇతర జిల్లాలకు వందలాదిగా వెళుతున్నాయి. ఇవన్నీ కూడా 40టన్నులకు పైబడి ఉంటాయి. దీంతో రోడ్డు ఎంతో నాణ్యతగా వేస్తే తప్ప వీటిని తట్టుకునే అవకాశం లేదు.

చుట్టూ ఎన్‌హెచ్‌లే.. అయినా..

ఆర్టీపీపీకి చుట్టూ నేషనల్ హైవేలున్నాయి. ముద్దనూరు-కడప, ప్రొద్దుటూరు-వేంపల్లి, మైదుకూరు-జమ్మలమడుగు ఇలా అన్ని రోడ్లూ ప్రస్తుతం ఎన్‌హెచ్‌లే. ఇవన్నీ ఆర్టీపీపీ నుంచి ఎటు చూసినా 20కి.మీ లోపే. అయినా ప్లాంటు నుంచి ఇప్పటికీ వీటికి అనుసంధానం కాలేదు. మూడు దశాబ్దాలు దాటినప్పటికి ఇక్కడి అధికారులు కాని, పాలకులు కాని వీటిపై దృష్టిపెట్టలేదు. ఈ ప్లాంటు ప్రారంభించి మూడు దశాబ్దాలు దాటిన పట్టించుకోవడంలేదని, అయితే ఓ భారీ ప్రైవేట్ సిమెంట్ పరిశ్రమకు మాత్రం ఆగమేఘాల మీద కోట్లు మంజూరు చేసి రోడ్డు వేయించారని ప్రజలు విమర్శిస్తున్నారు.

నిత్యం నరకమే..

ఆర్టీపీపీలో నివాసం ఉంటున్న వేలాది మంది ఉద్యోగులు, వారి కుటుంబాలు ఏ చిన్న పనిపడినా ప్రొద్దుటూరుకు వెళుతున్నారు. కేవలం 15కి.మీ మాత్రమే దూరముండే ఈ రస్తా నరకప్రాయంగా ఉంది. అన్నీ గుంతలే. ఎదురుగా వచ్చే వాహనాకి సైడ్ ఇవ్వాలన్నా ఇబ్బందులే. అలాగే రాత్రి పూట ప్రయాణం చేసే వాహనదారుల పరిస్థితి ఇక చెప్పనక్కర్లేదు. ఈ దారిలో రాకపోకల సమయంలో ప్రమాదాలు జరిగి ఉద్యోగులు, చుట్టపక్కల గ్రామాలకు చెందిన వారు ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. మరికొందరు వికలాంగులుగా మారడంతో వారి కుటుంబాలు ఇప్పటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. దీంతో ఆర్టీపీపీ నుంచి వెళ్లే వారు పోట్లదుర్తి మీదుగా చుట్టుమార్గంలో పోతున్నారు. ప్లాంటు నుంచి ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన బస్సులు కూడా ఈ మార్గంలోనే వెళుతున్నాయి. అలాగే ముద్దనూరు నుంచి, సున్నపురాళ్లపల్లె, చిలమకూరు నుంచి ఆర్టీపీపీ మీదుగా ప్రొద్దుటూరుకు ఇది చాలా దగ్గరి మార్గం. దీంతో వేలాది మంది ఈ మార్గంలోనే వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ రోడ్డు అత్యంత దారుణంగా ఉండటంతో ఎర్రగుంట్ల, పోట్లదుర్తిమీదుగా వెళుతున్నారు. రెండు నేషనల్ హైవేలను కలిపే అత్యంత ప్రాధాన్యత ఉన్న రోడ్డు కూడా కావడం విశేషం. కానీ ఈరోడ్డును ఆర్ అండ్ బీ వారు కాని, ఆర్టీపీపీ యాజమాన్యం కాని పట్టించుకోవడంలేదు. చిన్నదండ్లూరు, ఇల్లూరు, కలమల్ల, మేకలబాలాయపల్లె.. ఇలా అనేక గ్రామాల నుంచి ఇదేరోడ్డులో వెళుతున్నారు. నేడు రోడ్డు పరిస్థితి అధ్వాన్నంగా ఉండటంతో పాటు ప్రాణాలకు హానికరంగా మారింది. ఇప్పటికైనా ఈ రోడ్డును వెంటనే బాగుచేయించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఆర్టీపీపీఈ సివిల్ ఎస్ఈ శ్రీధర్ దృష్టికి తీసుకుపోగా.. ఆర్టీపీపీ-ప్రొద్దుటూరు రోడ్డు మరమ్మతులకు, కొంత కొత్త సీసీ రోడ్డు వేసేందుకు ప్రతిపాదనలు హెడ్ ఆఫీస్‌కు పంపామని అన్నారు.. అక్కడి నుంచి నిధులు మంజూరు కాగానే పనులు మొదలు పెడతామన్నారు.

ఎన్‌హెచ్‌గా మారుస్తా : ఎమ్మెల్యే ఆది

ఆర్టీపీపీ నుంచి ప్రొద్దుటూరుకు వెళ్లే రోడ్డును నేషనల్ హైవేలో అనుసంధానం చేస్తానని ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు నుంచి ముద్దనూరు - ప్రొద్దుటూరు వయా ఆర్టీపీపీ ద్వారా రోడ్డు వేసేందుకు కేంద్ర మంత్రితో మాట్లాడతానన్నారు. రోడ్డు మంజూరు అయ్యేలోగా తాత్కాలికంగా ఎలాంటి ఇబ్బందుల్లేకుండా మరమ్మతులు చేయిస్తామన్నారు.

ఎన్జీవో సంఘం హౌస్ బిల్డింగ్ సొసైటీలో రూ.100 కోట్ల అక్రమాలు

- రాష్ట్ర, జిల్లా అధ్యక్షులతో పాటు..
- సలహాదారు చంద్రశేఖర్ రెడ్డిని విచారణ చేపట్టాలి
- ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడి డిమాండ్



మాట్లాడుతున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘం నేతలు

కడప(కలెక్టరేట్), జూన్ 8: కడప జిల్లా ఎన్జీవో కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీలో అధ్యక్షుడు కొండారెడ్డి పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డాడని, ప్రభుత్వం విచారణ చేసి చర్యలు చేపట్టాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.రమేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ప్రభుత్వ ఉద్యోగ సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కొండారెడ్డి కాలపరిధిలో దాదాపు 400 ఇళ్ల స్థలాలను అర్హులైన సభ్యులకు కాకుండా నచ్చినవారికి కేటాయించి కోట్లాది రూపాయల సొమ్ము చేసుకున్నాడని ఆరోపించారు. ప్రజల సౌకర్యార్థం ఉంచిన 41 చదరపు గజాల స్థలంలో అపార్టుమెంట్లు నిర్మించి, ప్లాట్ల కేటాయింపుల్లో అవకతవకలకు పాల్పడ్డాడన్నారు. ఇతని అవినీతిలో రాష్ట్ర ఎన్జీవో సంఘ అధ్యక్షుడు కేవీ శివారెడ్డితో పాటు, ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్ రెడ్డిల పాత్ర ఉందన్నారు. అలాగే కో-ఆపరేటివ్ అధికారిణి సహకారం ఉందన్నారు. వీరందరిని విచారణ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

గతంలో హౌస్ బిల్డింగ్ సొసైటీ అవినీతిపై సభ్యులు, డైరెక్టర్లు, కొన్ని సంఘాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. హిందూపూర్ డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి విచారణ చేపట్టి హౌస్ బిల్డింగ్ సొసైటీలో అక్రమాలు జరిగాయని రాష్ట్ర కమిషనర్‌కు 2023లోనే నివేదికలు పంపించారన్నారు. రాష్ట్ర కమిషనర్ కూడా స్పందించి అదే ఏడాది సమగ్ర విచారణకు ఆదేశించారని తెలిపారు. తన అవినీతిని కప్పి పుచ్చేందుకు ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి సమగ్ర విచారణను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. హౌస్ బిల్డింగ్ సొసైటీ రికార్డులను స్వాధీనం చేసుకుని విచారణ చేస్తే వీళ్ల అవినీతి బట్టబయలవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగ సంఘ నాయకులు రాష్ట్ర సెక్రటరీ రఘురామనాయుడు, అసోసియేట్ ప్రెసిడెంట్ వి.సుబ్బయ్య, జిల్లా సెక్రటరీ సుదర్శన రెడ్డి, కోశాధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యకృషీవలుడు..అక్షర యోధుడికి అశ్రునివాళి

● రామోజీరావు పార్థివ దేహానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి నివాళి





రామోజీ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి...సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న ప్రొఫెసరు మూలమల్లిఖార్జునరెడ్డి... హరిటవర్స్‌లో నివాళి

కడప (ఎడ్యుకేషన్), జూన్8:రామోజీ గ్రూపు సంస్థల అధినేత, నిత్యకృషీవలుడు, అక్షరయోధుడు రామోజీ రావు మహాబినిష్క్రమణం ఎంతో ఆవేదనకు, బాధకు గురి చేసిందని పలువురు పేర్కొన్నారు. ఆయన తెలుగు సమాజానికి, దేశానికి చేసిన సేవలు మరువలేనవి. ఆయన మృతి పట్ల పలువురు నివాళులర్పించారు. శనివారం హైదరాబాదు రామోజీ ఫిలిం సిటీలో రామోజీరావు పార్థివ దేహానికి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి తనయుడు తదితరులు పాల్గొన్నారు.

వైవీయులో...కడప నగరం యోగివేమన యూనివర్సిటీ ఆధ్వర్యం లో గల సీపీ బ్రౌన్‌భాషా పరిశోధన కేంద్రంలో రా మోజీరావు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామోజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పాలకమండలి సభ్యులు మూల మల్లిఖార్జునరెడ్డి మాట్లాడుతూ రామోజీరావు 'అన్నదాత, చతుర, విపుల, తెలుగువెలుగు, బాలభారతం వంటి పత్రికల సంపాదకుడిగా కీర్తి గడించారన్నారు.

హరిటవర్స్‌లో...కడప నగరం హరిటవర్స్‌లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ ఆధ్వర్యంలో రామోజీరావుకు నివాళులర్పించారు. కార్యక్రమంలో బలిజ సంఘ అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత అమీర్‌బాబు ఆధ్వర్యంలో...
కడప నగరం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్‌బాబు కార్యాలయంలో శనివారం రామోజీరావు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు కుటుంబంలో పుట్టి కష్టపడి అంచెలంచెలుగా ఎదిగిన వ్యక్తి రామోజీరావు అన్నారు.

గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో...
గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాదెండ్ల బాబ్జి రామోజీకి నివాళి అర్పించారు.

రామోజీరావు బహుముఖ ప్రజ్ఞాశాలి: తులసిరెడ్డి
వేంపల్లె, జూన్ 8:స్వర్గీయ రామోజీరావు బహుముఖ ప్రజ్ఞాశాలి, చరిత్రకారుడని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి కొనియాడారు. శనివారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రామోజీరావు పరమపదించడం బాధాకరమన్నారు. ఈనాడు పత్రికాధిపతిగా, ఈటీవీ అధిపతిగా, మార్గదర్శి చిట్‌ఫండ్, ప్రియాపచ్చళ్లు, కళాంజలి, డాల్ఫిన్ గ్రూప్ హోటల్స్, చలనచిత్ర నిర్మాతగా, ఉషాకిరణ్ మూవీస్ చిత్ర నిర్మాణ సంస్థ, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రామోజీ ఫిల్మ్‌సిటీ అధినేతగా ఇలా అడుగుపెట్టిన అన్ని రంగాలలో రామోజీరావు రాణించారన్నారు. స్వయం కృషి, స్వీయ ప్రతిభ, పట్టుదల, క్రమశిక్షణతో ఒక సామాన్యుడు అసామాన్యుడు కాగలడని ఆయన నిరూపించారన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శం, అనుసరణీయమన్నారు.

రామోజీరావు మరణం తీరని లోటు
కడప (నాగరాజుపేట), జూన్ 8 : ఈనాడు సంస్థల అధినేత, ప్రముఖ వ్యాపారవేత్త రామోజీరావు మరణం తీరని లోటు అని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కడప నగర కార్యదర్శి ఎం.రామ్మోహన్ అన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు జర్నలిజాన్ని ఓ మలుపు తిప్పిన ఘనత ఆయనదేనన్నారు. మారుమూల గ్రామాలకు చేరవేసిన ఘనత ఆయనదన్నారు. వారి కుటుంబ సభ్యులకు సీపీఐ జిల్లా నగర కమిటీ తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు.



రామోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకుడు అమీర్‌బాబు

పెన్నాకు వరద నీరు



చెన్నూరు వద్ద పెన్నానదిలో ప్రవహిస్తున్న నీరు

చెన్నూరు, జూన్ 8 : రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో శనివారం రాత్రికి పెన్నానదిలో వరదనీరు ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతంలో భారీగా కురిసిన వర్షాలతో కుందూనదిలో ప్రవాహం రావడంతో ఆ నీరు పెన్నాలో చేరి చెన్నూరు వద్దకు వచ్చేసరికి భారీగా ప్రవహిస్తోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మైనర్ డ్రైవింగ్‌లపై టార్గెట్

● పిల్లలకు వాహనాలు ఇస్తే సీజ్ చేస్తాం
● వన్‌టౌన్ సీఐ భాస్కరరెడ్డి



సీజ్ చేసిన వాహనాలతో సీఐ భాస్కర్‌రెడ్డి తదితరులు

కడప (క్రైం), జూన్ 8 : చిన్నపిల్లలకు బండ్లు ఇవ్వడం, రోడ్లపై వారు వాహనాలను విచ్చలవిడిగా నడపడంపై పోలీసులు సీరియస్ అయ్యారు. మైనరు డ్రైవింగ్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి, ఎస్‌ఐ రంగస్వామి సిబ్బందితో కలిసి శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఎర్రముక్కపల్లె రాజీవ్‌మార్గ్ వద్ద తనిఖీలు నిర్వహించారు. వాహనాలు నడుపుతున్న మైనర్లను గుర్తించి వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలకు గురి కావడ మే కాక వీరి వల్ల ఇతర వాహనాలు వారు ప్రమాదాల పాలు కావాల్సి వస్తుందన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. చిన్న పిల్లలు మారాం చేశారని వారికి బండ్లు ఇస్తే ప్రమాదాల రూపంలో వారిని నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఎవరైనా వాహనాలు నడుపుతూ మైనర్లు పట్టుబడితే ఆ వాహనాలు సీజ్ చేస్తామన్నారు. వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తున్న 40 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఎన్నికల అధికారి మధుసూదన్‌కు సన్మానం

కడప (నాగరాజుపేట), జూన్ 8:కడపలో ఎన్నికల సమయంలో ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా నిర్వహించిన ఎన్నికల అధికారి మధుసూదన్‌ను టీడీపీ నాయకులు లయన్ పఠాన్‌ఖాదర్‌బాషా, షేక్ అహ్మదుల్లా, చాంద్‌బాషాలు శనివారం ఆర్డీఓ కార్యాలయంలో ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ నగరంలో ఎన్నికలు, ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరగడం ఆనందంగా ఉందన్నారు. కొత్త ప్రభుత్వంలో ప్రజలందరికీ మేలు జరిగి ప్రతి ఒక్కరికీ పథకాలు అంది సంతోషంగా ఉండాలన్నారు.

రామోజీ మరణం తీరని లోటు



నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 8: రామోజీ మరణం జర్నలిజానికి తీరని లోటు అని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా అన్నారు. శనివారం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో రామోజీకి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రామోజీరావు తెలుగు జర్నలిజాన్ని మలుపు తిప్పిన మహోన్నత వ్యక్తి అని, లక్షలాది మందికి ఉద్యోగ ఉపాధి కల్పించారన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్‌బాబు, జావీదు పాల్గొన్నారు.

గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంత జీవనం సాగించండి

●రెడ్ శాండల్ ఫోర్స్ సీఐ నారాయణ యాదవ్

సింహాద్రిపురం, జూన్ 8: ఎన్నికల తర్వాత జరుగుతున్న పరిణామాల దృష్ట్యా ఎటువంటి గొడవలు చేసుకోకుండా ప్రశాంత జీవనం సాగించాలని కడప రెడ్ శాండల్ ఫోర్స్ సీఐ నారాయణ యాదవ్ సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సింహాద్రిపురం ఎస్‌ఐ అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఐదేళ్లకు ఒక సారి ఎన్నికలు వస్తుంటాయి. జయాపజయాలు ప్రజా తీర్పుపై ఉంటుంది. కానీ జయాపజయాలు సమానంగా భావించే విధానం అలవాటు చేసుకోవాలని సీఐ సూచించారు. దాని కోసం ఘర్షణలకు పాల్పడితే చాలా నష్టపోవాల్సి వస్తుందన్నారు. కొంతమంది గొడవలను రెచ్చగొట్టేవిధంగా మాట్లాడితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా కొన్ని గ్రామాలకు పీస్ కమిటీ సభ్యులను ఏర్పాటు చేశారు. అనంతరం సింహాద్రిపురం పుర వీధుల్లో సెంట్రల్ ఫోర్స్(ఎస్ఎస్‌బీ) సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. చిన్న చిన్న గొడవలు, ఫ్యాక్షన్ జోలికి వెలితే తర్వాత కేసులు, కోర్టులు లాంటి పరిణామాలను సింహాద్రిపురం బస్టాండు సర్కిల్‌లో ప్రజలకు సీఐ నారాయణయాదవ్, ఎస్‌ఐ అనీల్‌కుమార్ వివరించారు. కమిటీ సభ్యులు, సిబ్బంది, సెంట్రల్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.



బస్టాండు ఆవరణంలో ప్రజలకు సూచనలు ఇస్తున్న సీఐ, ఎస్‌ఐలు

'కదిరి ఎమ్మెల్యేకు మంత్రివర్గంలో స్థానం కల్పించండి'



సమావేశంలో మాట్లాడుతున్న కళ్యా సుధాకర్

కడప (మారుతీనగర్), జూన్ 8: కష్టాల కడలిలో ఎదురీదుతూ అన్నమో రామచంద్రా అంటూ ఆకలిదప్పులతో, అప్పులబాదతో సతమతమవుతున్న నేతన్నలకు ఊరటగా నేతన్న వర్గానికి చెందిన కదిరి ఎమ్మెల్యే వెంకటప్రసాద్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని తొగటవీర క్షత్రియ సంక్షేమసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కళ్యాసుధాకర్ కోరారు. శనివారం స్థానిక యర్రముక్కపల్లెలోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మనదేశంలో వ్యవసాయరంగం తర్వాత చేనేత అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు కడు దయనీయ స్థితిలో బతుకుతున్నాయన్నారు. ఈనెల 12న రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతుల స్వీకరించనున్న నారా చంద్రబాబునాయుడు పెద్ద మనసుతో స్పందించాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 30 లక్షల మంది తొగటవీరక్షత్రియులున్నారన్నారు. వీరంతా టీడీపీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు తెలుగుదేశం పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నారన్నారు. కావున నేతన్నల సాధకబాధలు తెలిసిన కదిరి ఎమ్మెల్యే వెంకటప్రసాద్‌ను చేనేత జౌళిశాఖ మంత్రిగా అవకాశం కల్పిస్తే నేతన్నలకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణ, సుదర్శన్, బాలచౌడన్న, బండి కృష్ణయ్య, వెంకటస్వామి, సుదర్శన్, శంకర్, సుబ్రమణ్యం మురళికృష్ణ పాల్గొన్నారు.

శాంతిభద్రతలను కాపాడండి

మైదుకూరు రూరల్ జూన్ 8 : మొన్న జరిగిన ఎన్నికల్లో ప్రజలు తమ ఓటును ప్రశాంతంగా వినియోగించుకున్నారు, అందుకుగాను పీస్ కమిటీ కూడా చాలా బాగా సహకరించిందని మైదుకూరు సీఐ మస్తాన్ శనివారం వనిపెంటలో జరిగిన పీస్ కమిటీ సమావేశంలో అన్నారు. ఎన్నికలు ముగిశాయని ప్రజలు,నాయకులు ఎక్కడైనా కాని అల్లర్లు జరుగకుండా చూడవలసిన బాధ్యత పీస్ కమిటీకి ఉందని తెలిపారు. ఎక్కడైన అల్లర్లు జరిగినా వారిపై కఠినచర్యలు తీసుకొనే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలందరూ శాంతిభద్రతలు పాటించాలని కోరారు.ఈ కార్యక్రమానికి అఖిలపక్షానికి చెందిన నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



పార్టీల నేతలతో మాట్లాడుతున్న సీఐ మస్తాన్

పుత్తా విజయం పట్ల మండల కన్వీనర్‌కు సన్మానం

సీకేదిన్నె, జూన్ 8: కమలాపురం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా పుత్తా చైతన్యరెడ్డి విజయం సాధించడం పట్ల చింతకొమ్మదిన్నె మండల కన్వీనర్ టక్కోలి వెంకటకృష్ణారెడ్డిని టీడీపీ మండల నాయకులు ఘనంగా సన్మానించారు. పుత్తా చైతన్యరెడ్డి విజయానికి విశేష కృషి చేసి అధిక మెజార్టీ సాధించడంలో చింతకొమ్మదిన్నె మండలం నియోజకవర్గంలోనే అధిక మెజార్టీ తీసుకురావడం అభినందనీయమన్నారు. నాయకులు, కార్యకర్తలను కలుసుకుని ముందుకుపోయిన టీడీపీ మండల ఇన్‌చార్జిని మండల వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలుపుకున్నారు. చింతకొమ్మదిన్నె మండలంలో 7,100 ఓట్లు మెజార్టీకి కృషి చేసిన మండల ప్రజలకు, కార్యకర్తలకు, నాయకులకు మండల ఇన్‌చార్జి ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ నాయకులు పారాహంస్సేన్, పెద్దన్న పాల్గొన్నారు.



టీడీపీ మండల ఇన్‌చార్జిని అభినందిస్తున్న నాయకులు, కార్యకర్తలు

అచ్చెన్నాయుడికి లక్ష్మీరెడ్డి శుభాకాంక్షలు



అచ్చెన్నాయుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న లక్ష్మీరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 8:రాష్ట్రంలో టీడీపీ అఖండ విజయం సాధించడంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడిని శనివారం టీడీపీ సీనియర్ నాయకుడు లక్ష్మీరెడ్డి ఆయన కుటుంబ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజలు ఓటు ద్వారా తిప్పికొట్టారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్మోహన్‌రెడ్డి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

కమలాపురం రూరల్, జూన్ 8:మండల పరిధిలోని విభరాపురం గ్రామంలోని మం డల పరిషత్ ప్రాథమిక పాఠశాల బాల బాలికలకు స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. శనివారం విభరాపురం గ్రామంలోని బాలబాలికలకు ఆశా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమన్నారు. చాల మంది పేద విద్యార్థులు ఆర్థిక స్థోమత లేక చదువుకోలేక ఇళ్ల వద్ద ఉండే పరిస్థితి ఏర్పడుతుందని అలాంటి విద్యార్థులకు చదువుకున్నప్రోత్సహిస్తూ విద్యాసామగ్రి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. లీడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సందాస్ హనీ వారి ఆర్థిక సహాయంతో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, క్లిప్ అట్టలు బాక్సులు కలిపి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశామన్నారు. ఇంకా దాతల సహకారంతో అనేక సేవా కార్యక్రమాలు చేపడతామని వారు తెలిపారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దాతలు

'నకిలీ విత్తనాల అమ్మకందారులపై చర్యలు తీసుకోవాలి'

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 8: నకిలీ విత్తనాలు విక్రయించి రైతులను మోసం చేస్తున్న వ్యాపారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం తెలిపారు. ఖరీఫ్ సందర్భంగా వర్షాలు వస్తుండడంతో రైతులు పంటల సాగుకు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. అయితే కొందరు వ్యాపారులు రైతులకు నకిలీ విత్తనాలు, పురుగుమందులను అంటగడుతున్నారని తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

గొడవలు, అల్లర్లకు పాల్పడవద్దు: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ సుధాకర్ తదితరులు

కడప (క్రైం), జూన్ 8:గొడవలు, అల్లర్ల జోలికెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్ విజ్ఞప్తి చేశారు. శనివారం సాయంత్రం స్థానిక చిన్నచౌకు పోలీసుస్టేషన్ ఆవరణంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎన్నికల ఘట్టం పూర్తిగా ముగిసిందని, వాటిని మరిచి ఒకరికొకరు ప్రేమానురాగాలతో జీవించాలన్నారు. ఘర్షణలు, హింసాత్మక ఘటనల జోళికెళ్లి కేసుల్లో ఇరుక్కోవదని సూచించారు. ఏవైనా సమస్యలుంటే పోలీసుల ద్వారా చట్టపరిధిలో పరిష్కరించుకోవాలని సూచించారు.

విభజన హామీలను అమలు చేయాలి: పీఆర్‌ఎస్‌ఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

కడప (మారుతీనగర్), జూన్ 8: ఎన్డీఏ కూటమి ప్రభుత్వమైనా స్పందించి విభజన హామీలను అమలుచేయాలని ప్రోగ్రెసివ్ రెవల్యూషనరీ విద్యార్థి, యువజన సంఘం (పీఆర్‌ఎస్‌వైఎఫ్) రాష్ట్ర కన్వీనర్ శంకర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ప్రోగ్రెసివ్ రెవల్యూషనరీ విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామన్న హామీని సైతం నాటి బీజేపీ ప్రభుత్వం అటకెక్కించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించకుండా కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. కరువుకు నిలయంగా, వలసలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన రాయలసీమలో నెలకొల్పుతామన్న ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసి తద్వారా నిరుద్యోగ సమస్యకు ఉపాధి వలసలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత కేంద్రంలోని కొత్త ప్రభుత్వంపై ఉందన్నారు. ఇదిలావుండగా విద్యారంగం పట్ల గత వైసీపీ ప్రభుత్వం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. దీంతో పాటు పెండింగ్‌లో ఉన్న హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు, అలాగే కాస్మోటిక్ చార్జీలు, స్కాలర్ షిప్స్, రీయింబర్స్‌మెంట్‌లను సైతం త్వరితగతిన పంపిణీ అయ్యేలా పాలక ప్రభుత్వాలు దృష్టి సారించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

నూతన కన్వీనింగ్ కమిటీ ఎన్నిక
సమావేశం అనంతరం 15 మందితో కూడిన ప్రోగ్రెసివ్ రెవల్యూషనరీ విద్యార్థి, యువజన సంఘం నూతన కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. ఆ మేరకు రాష్ట్ర కన్వీనర్స్‌గా నాగేంద్రబాబు, వెంకటరమణ, శ్రీనాథ్, బాలా జీ, వెంకటేష్, శివప్రసాద్‌తో పాటు కన్వీనింగ్ సభ్యులుగా చిన్నా, సోహెల్, వేణు, కిరణ్, సుధీర్, అనిల్, రాజు, సురేష్ ఎన్నికయ్యారు.

చక్రాయపేటలో టీడీపీ సంబరాలు



శివాలయంలో పూజలు చేసి విజయకేతనం చూపుతున్న టీడీపీ నాయకులు

చక్రాయపేట, జూన్ 8: ఈ ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ కూటమి భారీ మెజార్టీని సాధించడంతో మండలంలో తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంల శనివారం మండలంలోని సురభి బాలతిమ్మయ్యగారిపల్లె టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని వేడుక చేసుకున్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి శివాలయంలో పూజలుచేశారు. టెంకాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీనాయకులు టి.రాధాకృష్ణయ్య, సి.పూర్ణ, సి.కిషోర్, టి.అమర్‌నాథ్, కె.ప్రసాద్, టి.ప్రహ్లాద, టి.రెడ్డిప్రసాద్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుత్తా చైతన్యరెడ్డి గెలుపు సందర్భంగా ఆలయాల్లో పూజలు

చెన్నూరు, జూన్ 8: పుత్తా చైతన్యరెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించిన సందర్భంగా శనివారం టీడీపీ నాయకులు, అభిమానులు స్థానిక హనుమాన్, వెంకటేశ్వర ఆలయాల్లో కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా తెలుగు యువత మండల అధ్యక్షుడు పాలగిరి సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కల్లూరు ఓబుల్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కుంచెం రామక్రిష్ణారెడ్డి, పాలగిరి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఎన్డీఏ కూటమికి 164 సీట్లు వచ్చిన సందర్భంగా 164 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకోగా, హనుమాన్ ఆలయంలో తెలుగు యువత అధ్యక్షుడితోపాటు చిన్న ఓబుల్‌రెడ్డి, చదిపిరాళ్ల మల్లిఖార్జున రెడ్డి, కనుపర్తి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 108 కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ మన్న మోహన్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, బీసీ సెల్ కార్యదర్శి గోదిన శ్రీనివాసులు, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి. పావురాళ్ల రమణ, యువనేత సంజీవ్‌పవన్, జిల్లా రైతు విభాగం కార్యదర్శి ఆర్.సుధాకర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆంజనేయుడి ఆలయం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న తెలుగుయువత ఉపాధ్యక్షుడు కల్లూరి ఓబుల్‌రెడ్డి తదితరులు

తప్పిన ప్రమాదం



దెబ్బతిన్న ఎమర్జెన్సీ రికవరీ వెహికల్ - రోడ్డు పక్కకు దూసుకెళ్లి ఆగిన ట్యాంకర్

రైల్వేకోడూరు, జూన్ 8: మాధవరంపోడు ప్రధానదారిపై శనివారం ట్యాంకర్ ఎమర్జెన్సీ రికవరీ వెహికల్‌ను ఢీకొంది. స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. ట్యాంకర్ రైల్వేకోడూరు నుంచి కడప వైపు వెళుతుండగా ఎదురుగా ఎమర్జెన్సీ రికవరీ వాహనం వస్తోంది. ఐతే ట్యాంకర్ అదుపు తప్పి ఎమర్జెన్సీ రికవరీ వాహనాన్ని ఢీకొంది. అందులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు. ఢీకొన్న ట్యాంకర్ కంపచెట్లలోకి వెళ్లి ఆగిపోవడంతో ప్రమాదం తప్పింది. పోలీసులు విచారిస్తున్నారు.

గండికి భారీగా భక్తులు



గండిలో క్యూలో నిల్చున్న భక్తులు

చక్రాయపేట, జూన్ 8: గండి దేవస్థానంలో శనివారం భక్తులు భారీగా వచ్చారు. ఉదయం 9గంటల నుంచి రెండు గంటల వరకు భక్తులు క్యూలో నిలబడి అంజన్నను దర్శించుకున్నారు. రెండో శనివారం కావడం, సెలవులు ఉండడంతో గండికి భారీగా భక్తులు చేరుకుని అంజన్నకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందారెడ్డి అన్ని ఏర్పాట్లు చేశారు. ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్ స్వామివారికి తోమాలలు అలంకరించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సర్వదర్శనం, స్పెషల్ దర్శనం, వీఐపీ దర్శనాలు ఈ వారం ఎక్కువగా ఆకుపూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తులు తమ వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించుకున్నారు.

దొంగలు పడ్డారు - ఇసుకను దోచుకెళ్లారు



పగడాలపల్లె సమీపంలో ఉన్న ఇసుక డంపు

పెండ్లిమర్రి, జూన్ 8: సాధారణంగా ఇళ్లు, గుళ్లు, దుకాణాలు, చివరికి ప్రభుత్వ ఆఫీసుల్లో సైతం దొంగలు చోరీలు చేసేది చూశాము. ప్రస్తుతం ఇసుకను దోచుకెళ్లారని పలువురు బహిరంగంగా చెబుతూ ఎగతాళి చేస్తున్నారు. పెండ్లిమర్రి మండలంలో జరిగిన ఇసుకను దోచుకెళ్లిన సంఘటనలోకెళితే...

వర్షాలు కురిసి నదుల్లోకి నీళ్లు వస్తే ఇసుక తవ్వకాలు జరపడం కష్టంగా ఉంటుందని, భవన నిర్మాణ రంగాలు, ప్రజల గృహ నిర్మాణాల అవసరాల కోసం, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల కోసం పనులు ఆగిపోకుండా ఉండేందుకు ముందుగానే ఇసుకను డంపుల రూపంలో నిల్వచేస్తారు. అవసరాన్ని బట్టి అక్కడి నుంచి ఇసుకను తరలిస్తారు. ఇందులో భాగంగా నదీపరివాహక ప్రాంతాల్లో కొన్నిచోట్ల డంపులు చేశారు. ఎక్కడైన దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు, డబ్బు దోచుకోవడంచూశాం. ఇసుక డంపుల్లో దొంగలు పడి ఇసుకను తీసుకెళ్లడం పెండ్లిమర్రి మండలంలోనే చూస్తున్నాం. ఈ ఇసుక డంపులే అక్రమ రవాణదారులకు కల్ప తరువుగా మారింది. మండలంలో పాపాఘ్ని నదినుంచి ఇసుక తవ్వకాలు జరిపి పగడాలపల్లె, కొత్తగంగిరెడ్డిపల్లె, ఉలవలపల్లె గ్రామాల పరిధిలో ఇసుకను డంపింగ్ చేశారు. ఇపుడు పగడాలపల్లె సమీప డంపులో ఇసుక అక్రమ రవాణాదారులు రాత్రివేళ ఎక్స్‌కవేటర్లను పెట్టి టిప్పర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం మండలంలో డంపుల నుంచి రాత్రి వేళ టిప్పర్ల ద్వారా ఇసుక తరలించడం హాట్ టాపిక్‌గా మారింది.

రైలు మార్గం పూర్తయ్యేనా : తులసిరెడ్డి

వేంపల్లె, జూన్ 8: కడప-రాయచోటి-మదనపల్లె-బెంగుళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైలు మార్గాన్ని ఇకనైనా పూర్తిచేయాలని కాంగ్రెస్ రాష్ట్రమీడియా చైర్మన్ తులసిరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. శనివారం వేంపల్లెలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాయలసీమ సర్వతోముఖాభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 2008లో కడప-రాయచోటి-మదనపల్లె-బెంగుళూరు కొత్త బ్రాడ్‌గేజ్ రైలు మార్గాన్ని మంజూరు చేసిందన్నారు. 2010లో కేంద్ర రైల్వే మంత్రి మునియప్ప శంకుస్థాపన చేశారన్నారు. కడప నుంచి పెండ్లిమర్రి వరకు రైల్వేలైన్ పూర్తయిందన్నారు. కానీ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు విడుదల చేయలేదన్నారు. దీనికి తోడు ఈ రైలు మార్గాన్ని రద్దు చేయమని జగన్ 17.6.2021న రైల్వే శాఖకు లేఖ రాశారన్నారు. దీంతో పనులు ఆగిపోయాయన్నారు. కావున చంద్రబాబు ప్రభుత్వం వెంటనే రాష్ట్ర వాటాగా చెల్లించాల్సిన నిధులు విడుదల చేయాలని పనులు తిరిగి ప్రారంభింపజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రామాలయ నిర్మాణంలోనూ....

రాజకీయ గ్రహణం

ఊరంతా ఒక మాట ఆ ముగ్గురిదీ ఒక మాట ● అసంపూర్తిగా జిల్లెల్ల రామాలయ నిర్మాణం



అసంపూర్తిగా ఉన్న రామాలయాన్ని పూర్తి చేయాలని చూపుతున్న గ్రామస్తులు

పోరుమామిళ్ల, జూన్ 8: ఎక్కడైనా దేవాలయ నిర్మాణాలు చేపట్టాలన్నా కమిటీలు తప్పనిసరిగా ఉండాలి. అందులో వారు భాగస్వాములైతే టీటీడీ కూడా ఆ నిర్మాణానికి అదనపు నిధులు మంజూరు చేస్తారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఓ వైసీపీ నేత మాట విని ఊరంతా తీసుకున్న చోట కాకుండా ముగ్గురు మాత్రమే తమ సొంత పొలంలో నిర్మించుకున్న ప్రాంతంలో బేస్‌మెంట్ వేసుకుంటే ఆ ముగ్గురి మాట విని అక్కడ జియో ట్యాగ్ చేశారు అధికారులు. అసలు విషయానికొస్తే పోరుమామిళ్ల మండలం అక్కల్‌రెడ్డిపల్లె జిల్లెల్ల గ్రామంలో రామాలయంలో దేవదాయ ధర్మదాయ శాఖ తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో మంజూరైంది. అయితే తమ గ్రామంలో పురాతనం నుంచీ గ్రామ నడిబొడ్డున పాత రామాలయం ఉందని, అది అసంపూర్తిగా ఉండడంతో ప్రజల విన్నపంతో దేవాలయ నిర్మాణం కోసం రూ.8.50 లక్షలు నిధుల మంజూరు చేశారని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో నిర్మించే గుడికి నిధులు మంజూరైతే ఆ గ్రామంలోని వ్యక్తి తన ఇంటి వద్ద ఉన్న పొలంలో నిర్మించుకున్నందుకు రాజకీయంగా ప్రయత్నాలు చేసి నిర్మాణం మొదలు పెట్టారన్నారు. కానీ గ్రామ పెద్దలు మొత్తం కూడా దీన్ని వ్యతిరేకించడంతో దేవదాయశాఖ వారు రాజకీయ వత్తిళ్లతో ప్రజలు నిర్మించుకున్న గుడి కాదని మరొకరి పొలంలో నిర్మించే గుడికి మంజూరు చేసేందుకు ప్రయత్నించారని గ్రామ ప్రజలు తెలిపారు. గ్రామంలో ఎవరూ లేని సమయంలో రాజకీయ వత్తిళ్ల కారణంగా నిధులు మంజూరు చేసేందుకు జియో ట్యాగ్ చేశారన్నారు. కావున గ్రామనడిబొడ్డున ప్రజల కోసం నిర్మాణంలో ఉన్న రామాలయ నిర్మాణం పూర్తికి దేవదాయశాఖ అధికారులు, జిల్లా అసిస్టెంటు కమిషన్ వారు పూర్తిగా విచారణ జరిపి గ్రామస్తులకు న్యాయం చేయాలని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై దేవదాయశాఖ వర్క్ ఇన్‌స్పెక్టరు చరణ్‌ను పాత్రికేయులు వివరణ కోరగా, ఆ గ్రామానికి దేవాలయం మంజూరైన విషయం వాస్తవమేనని, తాను వెళ్లినప్పుడు ముగ్గురు నిర్మాణం చూపి ఇక్కడే రామాలయం నిర్మిస్తామని చెప్పడంతో దాన్ని జియోట్యాగ్ చేశామన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

నామినేటెడ్ పదవులకు రాజీనామా

జమ్మలమడుగు, జూన్ 8: జమ్మలమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కమిటీ చైర్‌పర్సన్లు, మెంబర్లు సంబంధిత అధికారులకు రాజీనామాలు సమర్పించారు. డివిజన్ సహకార శాఖ అధికారి ప్రొద్దుటూరు డివిజన్ కార్యాలయంలో, జమ్మలమడుగు సబ్‌డివిజన్ అధికారి కార్యాలయంలో సంబంధిత మండల సీఈఓలకు శనివారం రాజీనామాలు సమర్పించినట్లు జమ్మలమడుగు, పెద్దముడియం మండలాల సీఈఓలు మాబూసాని, బాలాంజనేయులు తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు జమ్మలమడుగు, పెద్దముడియం, మైలవరం, కొండాపురం, ముద్దనూరు మండలాల చైర్‌పర్సన్లు, కమిటీ మెంబర్లు ఆయా మండలాల సీఈఓలకు రాజీనామా పత్రాలు సమర్పించినట్లు తెలుస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా పరాజయం కావడం ఆ పార్టీ సంబంధిత ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కమిటీ నేతలు రాజీనామాలు సమర్పించినట్లు తెలిసింది. జమ్మలమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్‌పర్సన్ శివాంజనేయరెడ్డి, కమిటీ మెంబర్లు మార్తల పెద్ద ఓబుళరెడ్డి, మల్కిరెడ్డి సరోజమ్మ, ముడిమెల వెంకటకృష్ణారెడ్డి, తల్లపురెడ్డి బాబుల్‌రెడ్డి (పెద్దముడియం మండలం), శెట్టి సూర్యప్రతాప్, శిరయపు శివారెడ్డి, సానె రామచంద్రుడు(ముద్దనూరు), కొండు వాసుదేవరెడ్డి, చిక్కని రాజా, పాపిరెడ్డిగారి వెంకటమోహన్‌రెడ్డి(కొండాపురం), పి.మునిసుధీర్‌రెడ్డి, పి.వెంకటశివుడు(మైలవరం), తదితరులు ప్రొద్దుటూరు డివిజన్ కార్యాలయ అధికారి సురేష్, జమ్మలమడుగు సబ్‌డివిజన్ అధికారి ప్రభాకర్‌రావు, ఆయా మండలాల్లోని సీఈఓలకు రాజీనామా పత్రాలు అందించినట్లు కమిటీల మెంబర్లు, చైర్‌పర్సన్లు ఇచ్చిన పత్రాలను డివిజన్ కార్యాలయానికి పంపినట్లు తెలిపారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

కురబలకోట, జూన్ 8: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వేపోలీసులు తెలిపారు. కదిరి రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కురబలకోట రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని యువకుడు (35) రైలు కిందపడి మృతి చెందాడు. గమనించిన రైల్వే సిబ్బంది, స్థానికులు కదిరి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించి పోస్టుమార్టమ్ నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కదిరి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదంలో రూ.లక్ష ఆస్తి నష్టం

మదనపల్లె టౌన్, జూన్ 8: ప్రశాంతనగర్‌లోని ఓ ఇంట్లో అగ్నిప్రమాదం జరిగి రూ.లక్ష ఆస్తినష్టం వాటిల్లింది. మదనపల్లె ఫైర్ ఆఫీసర్ శివప్ప కథనం మేరకు..స్థానిక ప్రశాంత్‌నగర్ 11వ క్రాస్ వీధిలో పి.ప్రమీల ఇంట్లో మంటలు అంటుకున్నాయని సమాచారం వచ్చిందన్నారు. దీంతో తమ సిబ్బందితో, అగ్నిమాపక యంత్రం, సామగ్రితో సంఘటన స్థలానికి వెళ్లి మంటలను ఆర్పివేశామన్నారు. అప్పటికే వస్తువులు, దుస్తులు, ఫర్నీచర్ కాలిపోయాయన్నారు.

కాల్వపల్లె రోడ్డంటే హడల్

వైసీపీ ప్రభుత్వంలో మరమ్మత్తులు శూన్యం ● చౌడసముద్రం - రహదారి శిథిలం ● దుస్థితికి చేరడంతో వాహనదారుల అవస్థలు



కాల్వపల్లె సమీపంలో కంకర తేలిపోయి దుస్థితికి చేరుకున్న రోడ్డు

ములకలచెరువు, జూన్ 8: చౌడసముద్రం - కాలువపల్లె రోడ్డంటే అందరికీ హడల్. ఈ శిథిలమైన ఈరోడ్డుపై వెళ్లాలన్నా, రావాలన్నా కత్తిమీద సాములాంటిదే. ప్రతి విషయానికీ రాకపోకలు సాగించాలన్నా, రైతులు వ్యవసాయ దిగుబడులను మార్కెట్‌కు తరలించలన్నా, ఎరువులు, విత్తనాల వంటివి కావాలంటే ఏ వాహనమైనా ఇదే రోడ్డుగుండా వెళ్లాల్సిందే. ఇక అత్యవసర సేవలైన ఆస్పత్రులకు వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడంలేదు. ఆటోలు, ద్విచక్రవాహనాలు వెళ్లాలన్నా రోడ్లు బాగుండాలి. అలాంటిది పల్లె దారి శిథిలమైంది. చౌడసముద్రం - కాల్వపల్లె రోడ్డు చెప్పరానంతగా దుస్థితికి చేరింది. వైసీపీ ప్రభుత్వంలో రోడ్ల దుస్థితి చెప్పనవసరం లేదు. రోడ్ల మరమ్మత్తులకు చిల్లి గవ్వ కూడా విదల్చలేదు. రోడ్డంతా గుంతలమయమై దుస్థితికి చేరుకోవడం, పలు చోట్ల కంకర తేలిపోవడంతో ఈ మార్గంలో ప్రయాణించాలంటే హడలెత్తిపోతున్నారు. చౌడస ముద్రం నుంచి కాల్వపల్లె వరకు ఉన్న సుమారు ఎనిమిది కిలో మీటర్ల రోడ్డు దెబ్బతినింది. దీంతో చౌడసముద్రం నుం చి గుత్తావారిపల్లె, గుత్తావారిపల్లె తాండా, కనికలతండా, నెమ్మచెర్లబావి, రెడ్డివారిపల్లె, కురవాండ్లపల్లె, కాల్వపల్లె వరకు ఉన్న రోడ్లలో వాహనదారులు రాకపోకలు సాగించాలంటే సాహసం చేయాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు రోడ్డు మరమ్మత్తుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సెంట్రల్ బోలేవార్డులో నిలిచిన వర్షపునీరు

వానొస్తే తోడేయాల్సిందే

● బోలేవార్డు కోసం రూ.5కోట్లు ఖర్చు
● లోపభూయిష్టంగా నిర్మాణ పనులు
● వర్షపునీటితో ప్రజలకు తప్పని తిప్పలు

పులివెందుల టౌన్, జూన్ 8: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గంలోనూ వర్షం కురిస్తే మోటార్లు పెట్టి నీటిని తోడాల్సిందే. కోట్ల రూపాయలు ఖర్చుతో చేపట్టిన పనులు సైతం లోపభూయిష్టంగా తయారయ్యాయి. ఫలితంగా ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. వివరాల్లోకెళితే...

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత సొంత నియోజకవర్గం పులివెందులను సుందరీకరణ చేపట్టి అందమైన నగరంగా తీర్చిదిద్దాలని కోట్ల రూపాయలు వెచ్చించారు. పట్టణ నడిబొడ్డున పాత సత్రం స్కూల్ నుంచి కడప రోడ్డులోని పాత బస్టాండ్ వరకు సుమా రు రూ.5.40కోట్లతో సెంట్రల్ బోలే వార్డును నిర్మించారు. కానీ వర్షం వచ్చిందంటే చాలు బోలేవార్డు కాస్తా బురద వార్డుగా మారుతోంది. నిలిచిన నీటిని ట్యాంకర్లతో మున్సిపల్ పారిశుధ్యం కార్మికులు తోడేల్సిందే. నిర్మించే సమయంలో ఇంజనీర్లు లోపభూయిష్టమైన ప్రణాళికతో నిర్మించారు. వర్షపునీరు బయటకు పోవడానికి మార్గం లేకుండా నిర్మాణ పనులు చేయడంతో ఆ మార్గాన నడవాలంటే ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించి నిర్మించిన సెంట్రల్ బోలేవార్డుతో నేడు వర్షపు నీటితో అవస్థలు పడుతున్నారు. కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయింది. కేవలం కాంట్రాక్టర్ కోసమే పనిచేశారా అన్నట్లుగా ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు సెంట్రల్ బోలేవార్డు పనులను పర్యవేక్షించారా లేక కాంట్రాక్టర్ తనకు లాభసాటికోసం ఇష్టమొచ్చినట్లు సెంట్రల్ బోలేవార్డును నిర్మించారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వర్షం వస్తే ఎక్కడ చూసినా వర్షపునీరు నిలుస్తోంది. చిన్నపాటి వర్షం పడితేనే ఎక్కడచూసినా నీరు నిలుస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులను గురిచేస్తున్నాయి. షాపుల యజమానులకైతే అక్కడ నిలిచిన మురికినీటితో తిప్పలుతప్పడం లేదంటున్నారు.సెంట్రల్ బోలేవార్డుపై ప్రత్యేక శ్రద్ధవహించి నిర్మించకపోవడం వల్ల ఇటువంటి పరిస్థితి ఏర్పడిందని ప్రజలు అనుకుంటున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేయించారని అందువల్లనే ఎక్కడ చూసినా నీరునిలుస్తోందనే ఆరోపణలున్నాయి. రోడ్డులో ఎత్తుపల్లాలు ఉండడం వల్లే వర్షపునీరు బయటకువెళ్లడం లేదంటున్నారు. సుందరీకరణ కోసం నిర్మించారా, లేక ప్రజల్ని బురదనీటిలో తిరుగుతూ అవస్థలుపడేలా నిర్మాణం నడిబొడ్డున నిర్మించారా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. బోలేవార్డులో వర్షపు నీరు బయటకు వెళ్లేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

స్కూటరును ఢీకొన్న కారు



ప్రమాదానికి కారణమైన కారు

రైల్వేకోడూరు, జూన్ 8: నిలిచి ఉన్న స్కూటరును కారు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీప్యారడైజ్ సినిమా థియేటర్ సమీప ప్రధానదారిపై బీపీరాచపల్లె వాసి రామచంద్రరాజు నూనె కోసం మిల్లు దగ్గరకు వచ్చాడు. మిల్లు వద్ద తన స్కూటర్‌ను నిలిపి ఉండగా తిరుపతి నుంచి కడప వైపు వెళ్తున్న మహారాష్ట్రకు చెందిన కారు ఢీకొంది. అదే సమయానికి కూలీ పనులకు వెళ్లేందుకు రోడ్డుపై నిలుచున్న సుశీలను కూడా కారు ఢీకొంది. రామచంద్రరాజు తలకు తీవ్ర గాయంకాగా, సుశీలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేశారు. పోలీసులు బాధితులు ఫిర్యాదుతో విచారిస్తున్నారు.

నిత్యాన్నదానానికి రూ.3,00,116 విరాళం

చక్రాయపేట, జూన్ 8: గండి క్షేత్రంలో శాశ్వత నిత్యాన్నదానానికి రూ.3,00,116 విరాళం అందించినట్లు ఆలయ ఏసీ ముకుందరెడ్డి తెలిపారు. శనివారం బెంగళూరు వాసులు సదిపిరాళ్ల సురేష్ కుమార్‌రెడ్డి, సతీమణి మాధవీలత, కుమార్తె మానసరెడ్డి ఈ విరాళం అందించినట్లు తెలిపారు. దాతల కుటుంబ సభ్యులపేరుపై అర్చన చేయించినట్లు ఏసీ తెలిపారు.

బంగారు చోరీపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జూన్8: వైఎస్సార్ కాలనీకి చెందిన మదన మోహన్ ఇంట్లో 70 గ్రాముల బంగారు చోరీ గురైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకుస్థానిక వైఎస్సార్ కాలనీలో మదన్‌మోహన్, అతని భార్య మగ్గాలు నేయడానికి వెళ్లేవారు. వారు పనికి వెళ్లే ముందు ఇంటికి తాళం వేసి తాళాలను బాత్‌రూమ్‌లో ఉంచి వెళ్లుతుండేవారు. ఇది పసిగట్టిన వారు ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఇంట్లో ఉన్న 70గ్రాముల బంగారు అపహ రించారు. విషయం తెలుసుకున్న బాధితులు శనివారం చేసిన ఫిర్యాదుపై టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నిందితులను అరెస్టు చేస్తాం : సీఐ

మదనపల్లె అర్బన్, జూన్ 8: వీవర్స్ కాలనీలోని సొంత స్థలంలో ప్రహరీ కూల్చివేసిన నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని మదనపల్లె టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. కాలనీలో సర్వేనెంబరు 102లో 1.26 ఎకరాల భూమి వరదా సురజ్‌శ్రీ నుంచి ఎస్బీఐ కాలనీ వాసి పోతిరెడ్డి వసంత్‌రెడ్డి కొనుగోలు చేశారు. చుట్టూ ప్రహరీ నిర్మించి గేటు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో తనకు పరిచయం ఉన్న కొక్కంటి శివశంకర్‌కు టిప్పర్స్ ట్రాక్టర్స్ పార్కింగ్ చేసుకోవడానికి వసంత్‌రెడ్డి ఆ స్థలం ఇచ్చారన్నారు. మూడు రోజుల కిందట వరదా రెడ్డిశేఖర్, వరదా విద్యాసాగర్, వరదా బాలు, నాగేంద్ర ప్రసాద్ మరికొందరితో కలిసి ప్రహరీని, సీసీ కెమెరాలను ధ్వంసం చేశారన్నారు. స్థలం యజమాని పోతిరెడ్డి వసంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి కేసు నమోదు చేశారని తెలిపారు.

నేడు బలిజ సామాజిక వర్గం బైక్ ర్యాలీ

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 8: ఎన్నికల్లో జనసేన పార్టీ 21కి 21 ఎమ్మెల్యే సీట్లు, రెండు ఎంపీ సీట్లు గెలుపొంది వంద శాతం విజయం సాధించడంపట్ల ఆదివారం ఉదయం బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బలిజ సంఘం పట్టణాధ్యక్షుడు మంచిరాజా ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీ ఉదయం 10 గంటలకు పెన్నాతీరంలోని బలిజ కల్యాణ మండపం లో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహిస్తామని ఆ తర్వాత కల్యాణ మండపం వద్ద నుంచి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి శ్రీకృష్ణ దేవరాయుల విగ్రహానికి పూలమాల వేస్తామని తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన వరదరాజులరెడ్డిని కలిసి అభినందనలు తెలుపుతామని తెలిపారు.

ఘనంగా మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 8: స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మృత్యుంజయ హోమం ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు అనంతరం లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, ఉపగ్రహ, ఉపదేవతా, మృత్యుంజయ హోమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వెంటనే చేయాలి

కలసపాడు, జూన్ 8 : బద్వేలు నియోజకవర్గం కలసపాడులోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా నాయకులు ఈరి బాలజోజి, ఎంబడి ఈశ్వర్ తదితరులు ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న చంద్రబాబు, నరేంద్రమోదీకి శుభాకాంక్షలు తెలుపుతూ శనివారం కేక్ కట్ చేశారు. మాదిగలకు ఇచ్చిన మాట ప్రకారం న్యాయ సమ్మతమైన ఎస్సీ వర్గీకరణ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు.

రామోజీరావుకు ఘన నివాళి

జమ్మలమడుగు, జూన్ 8: జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజేష్‌రెడ్డి, మండలాధ్యక్షుడు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారు శనివారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న వారు ఢిల్లీ ఏపీ భవన్ వద్ద నివాళులర్పించి తెలుగు ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడుతూ మాట్లాడారు. కాగా టీఎన్ఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షుడు రంగనాధు, ఉపాధ్యక్షుడు సిద్దారాయల్ రామోజీరావు చిత్రపటానికి ఆయన మృతి పట్ల ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో చలపతి, భానుప్రకాష్, పవన్, పార్థసారధి, లక్ష్మణ్, మధు, రఘు, టీఎన్ఎస్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే రామోజీరావు మరణం తీరని లోటని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ అన్నారు. డీవైఎఫ్ఐ యువజన కార్యాలయంలో నివాళులు అర్పించి ఆయన సంతాపం ప్రకటించారు.

మైలవరం..: ఈనాడు పత్రిక అధిపతి రామోజీరావురావు మరణం పత్రికా రంగానికి తీరని లోటు అని కడప పార్లమెంట్ నాయీ బ్రాహ్మణ సాధికారిక జిల్లా అధ్యక్షుడు గజ్జల గోవింద్ అన్నారు. శనివారం మైలవరంలోని నాయీ బ్రాహ్మణ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు రంగనాధ్, జిల్లా కార్యదర్శి మహేష్, నాయకులు లోకేష్, శంకర్, పార్థసారధి, రఘునాథ, వాసు తదితరులు పాల్గొన్నారు.

అట్లూరు..: మండలంలోని టీడీపీ కార్యాలయంలో రామోజీరావు మృతికి సంతాపం తెలుపుతూ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామోజీరావు మృతి దేశానికి తీరని లోటు అని మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు ఎం.మహేశ్వర్‌రెడ్డి, పోతిరెడ్డి రెడ్డయ్య, నాయకులు జయక్రిష్ణారెడ్డి, ఎల్.నారాయణ, చిలిపి క్రిష్ణారెడ్డి, రాధాక్రిష్ణారెడ్డి, నరసారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బి.సుధాకర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కోటపాటి పెంచలయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, రామోజీరావు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

బద్వేలు..: ఈనాడు సంస్థల అధినేత, ప్రముఖ వ్యాపార వేత్త చెరుకూరి రామోజీరావు మృతి బాధాకరమని సీపీఎం బద్వేలు పట్టణ కార్యదర్శి శ్రీను అన్నారు. పట్టణంలోని సుందరయ్య భవనం లో శనివారం రామోజీరావుచిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

బి.కోడూరు..: ఈనాడు గ్రూపు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతి దేశానికి తీరని లోటు అని మండల టీడీపీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి అన్నారు. ఆయన మృతికి శనివారం చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాలులర్పించారు. ఈకార్యక్రమంలో రమణారెడ్డి, గోడి రమణారెడ్డి, దుగ్గిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, పవన్, రామ్మోహన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వీరరాఘవరెడ్డి, మిషన్ దుగ్గిరెడ్డి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: రామోజీరావు సేవలు మరువలేనివని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. రామోజీ గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మరణం బాధాకరమని ఆయన మృతి తెలుగు ప్రజలకు తీరని లోటు అన్నారు.

● హైదరాబాదులో రామోజీరావు పార్థీవదేహానికి ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి జి.వి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీ పట్టణాధ్యక్షుడు ఇ.వి.సుధాకర్‌రెడ్డి కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు పాల్గొన్నారు. అదే విధంగా రామోజీరావు మృతికి రాయలసీమ రాష్ట్ర సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి , జనసేన నాయకులు మాదాసుమురళి నివాళులు అర్పించారు.

నకిలీ విత్తనాల అమ్మకందారులపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 8: నకిలీ విత్తనాలు విక్రయించి రైతులను మోసం చేస్తున్న వ్యాపారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం తెలిపారు. ఖరీఫ్ సందర్భంగా వర్షాలు వస్తుండడంతో రైతులు పంటల సాగుకు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. అయితే కొందరు వ్యాపారులు రైతులకు నకిలీ విత్తనాలు, పురుగుమందులను అంటగడుతున్నారని తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

దేవదాయ,ఈనాం భూములను కాపాడాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

బద్వేలు, జూన్ 8: మున్సిపాలిటీ పరిధిలోని పది సంవత్సరాలుగా వివిధ సర్వేనెంబర్లలో ఈనాం, దేవదాయ భూములు కబ్జాకు గురయ్యాయని వాటిని ప్రభుత్వాధికారులు కాపాడాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, జిల్లా సమితి సభ్యుడు వెంకటరమణ పేర్కొన్నారు.శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములు, మోరీ కల్వర్టులు, చెరువులు సర్వేనెంబరు 1 నుంచి 90 వరకు ఉన్న వందలాది ఎకరాల భూములు కబ్జాకు గురయ్యాయని, దీనిపై ఓ వీఆర్వో తన చేతివాటాన్ని ప్రదర్శిస్తూ కబ్జాదారులకు సమాచారమిస్తూ వారినుంచి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ పట్టణ నాయకులు మునిరత్నం, చంద్ర, రమణ, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు



బద్వేలు రూరల్ జూన్ 8 : మండల పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జేష్టమాసం మొదటి శనివారం పురస్కరించుకుని స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం చేశారు. వేకువజామువనే ప్రత్యేక అభిషేకం, అనంతరం పూజలు నిర్వహించడంతో పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాలు నిర్వహించారు.

హిందూ ధర్మంపై ఇంటింటి ప్రచారం

దువ్వూరు(మైదుకూరు), జూన్ 8 : హిందూ ధర్మాలపై అవగాహన కల్పించేందుకు సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. దువ్వూరు మండలంలోని చింతకుంట ఎస్సీ కాలనీలో బిజేపీ నాయకులు అరవేటి హరిక్రిష్ణ, ఫౌండేషన్ సభ్యులు సుబ్రమణ్యం, ప్రకాశం తదితరులు హిందూ ధర్మాలపై ప్రజల్లో చైతన్యం తీసుకవచ్చేందుకు కరపత్రాలు, స్టిక్కర్లు పంపిణీ చేశారు.

టీడీపీ సీనియర్ నాయకుడు షబ్బీర్ మృతి



మైదుకూరు రూరల్ జూన్ 8 :మైదుకూరు మండలంలోని వనిపెంట గ్రామంలో నివశిస్తున్న ఫరీద్‌బాయ్ గారి షబ్బీర్ (52) శనివారం అనారోగ్యంతో ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని బంధువులు తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకులు ఇస్మాయిల్ సోదరుడు షబ్బీర్ పార్టీలో చురుకుగా పనిచేస్తుండేవాడు.బ్రెయిన్ స్ట్రోక్ వలన ఆయన మృతి చెందాడన్నారు. ఆదివారం మధ్యాహ్నం షబ్బీర్‌కు అంత్యక్రియలు జరుపుతున్నట్లు ఇస్మాయిల్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

పుట్టా , పవన్ గెలుపుపై తిరుమల పాదయాత్ర



దువ్వూరు(మైదుకూరు), జూన్ 8 :ఎమ్మెల్యేగా పుట్టా సుధాకర్ యాదవ్, జనసేనాని పవన్ పాటు రాష్ట్రంలో ఎన్డీయే కూటమి గెలుపొందడంపై దువ్వూరు మండలం నారాయణపల్లె వాసులు శనివారం తిరుమల శ్రీవారి దర్శనార్థం పాదయాత్రగా బయలు దేరారు. గ్రామానికి చెందిన ఏర్వ చంద్రమోహన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, గాలి ప్రసాద్‌రెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు దాదాపు 25 మంది తిరుమలకు బయలుదేరారు. కాగా మైదుకూరులోని శ్రీనగరం వద్ద జనసేన నాయకులు చిలుంగారి క్రిష్ణమూర్తి, రామగోవిందు, తరుగు సురేంద్ర, ఏవన్ సురేష్ తదితరులు వారికి స్వాగతం పలికి వారికి పాదయాత్రకు సరిపడే సదుపాయాలు అందచేస్తూ, పాదయాత్ర విజయవంతం కావాలని కోరారు.

ఆలూరుకోనకు పాదయాత్ర



కొండాపురం, జూన్ 8: చంద్రబాబు ముఖ్యమంత్రి కానుండటంతో శనివారం మండలం లోని టీడీపీ నాయకులు ఆలూరుకోన రంగనాయకులస్వామికి పాదయాత్రగా వెళ్లారు.10 మంది టీడీపీ నాయకులు మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామం నుంచి ఆలూరుకోన రంగనాయకులు స్వామి వద్దకు కాలినడకన సుమారు 25 కిలోమీటర్లు వెళ్లి తమ మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణపల్లె,తాళ్లప్రొద్దుటూరు,బురుజుపల్లె గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు శ్రీకాంత్‌నాయుడు,రంగనాయకులు,బుగ్గన్నగారి చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సహనం పాటించండి...శాంతి భద్రతలను కాపాడండి



వనిపెంటలో పలుపార్టీల నేతలతో మాట్లాడుతున్న సీఐ మస్తాన్

మైదుకూరు రూరల్ జూన్ 8 : మొన్న జరిగిన ఎన్నికల్లో ప్రజలు తమ ఓటును ప్రశాంతంగా వినియోగించుకున్నారు, అందుకుగాను పీస్ కమిటీ కూడా చాలా బాగా సహకరించిందని మైదుకూరు సీఐ మస్తాన్ శనివారం వనిపెంటలో జరిగిన పీస్ కమిటీ సమావేశంలో అన్నారు. ఎన్నికలు ముగిశాయని ప్రజలు,నాయకులు ఎక్కడైనా కాని అల్లర్లు జరుగకుండా చూడవలసిన బాధ్యత పీస్ కమిటీకి ఉందని తెలిపారు. ఎక్కడైన అల్లర్లు జరిగినా వారిపై కఠినచర్యలు తీసుకొనే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలందరూ శాంతిభద్రతలు పాటించాలని కోరారు.ఈ కార్యక్రమానికి అఖిలపక్షానికి చెందిన నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కూటమి నేతల జోష్

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 8: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో, ప్రొద్దుటూరులో తెలుగుదేశం పార్టీ అఖండ విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకుంటున్నారు. శనివారం అన్నా క్యాంటీన్‌లో టీడీపీ రాష్ట్ర నాయకుడు సీఎం సురేష్‌నాయుడు, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. కాగా ప్రొద్దుటూరు ఎమ్మెల్యేగా నంద్యాల వరదరాజులరెడ్డి 6వసారి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించుకున్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణంలో వరద సోదరుడు నంద్యాల ఆనంద భార్గవ్‌రెడ్డి, టీడీపీ మాజీ పట్టణాధ్యక్షుడు కేక్ కట్ చేశారు. అనంతరం వారిని బలిజసంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మూర్తి నరసింహులు, హరి శ్రీనివాసులు, ఆవుల శ్రీనివాసులు, సుదర్శన్, మహేంద్ర, మణికంఠ, రాఘవ, కల్యాణ్ పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: ఎన్డీయే కూటమి విజయంతో పోట్లదుర్తిలో అభిమానుల సందడి నెలకొంది. శనివారం ఉదయం సీఎంసురేష్‌నాయుడు విజయవాడ నుంచి రావడంతో అభిమానులు పెద్దఎత్తున పోట్లదుర్తికి చేరుకుని ఆయన్ను కలిశారు. పార్టీ మళ్లీ అధికారంలోకి రావడంతో ఆయనకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సీఎంరమేష్ అనకాపల్లి ఎంపీగా బారీ మెజార్టీతో గెలవడం ఎంతో సంతోషకరమన్నారు. అందరి కృషి పట్టుదలతో టీడీపీని అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తలు, నాయకుల కృషి మరువలేనిదని సీఎంసురేష్‌నాయుడు పేర్కొన్నారు.

మైలవరం..: ఎన్డీయేతోనే ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా అభివృద్ధి చెందుతుందని కూటమిసీనియర్ నాయకులు మందాడి భాస్కర్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తుండటంతో శనివారం మండల పరిధిలోని దొడియం గ్రామంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి చంద్రబాబు, ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: పవన్‌కళ్యాణ్ అత్యధిక మెజార్టీతో గెలుపొందడంతో బద్వేలు నియోజకవర్గ యువ బలిజ సంఘం అధ్యక్షుడు రుద్ర శ్రీకాంత్‌రాయల్ ఆధ్వర్యంలో 101 టెంకాయలు కొట్టి బాణసంచా పేల్చారు. శనివారం పోరుమామిళ్లలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో అయన టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, బలిజ సంఘం నేతలు తిరుమలశెట్టి సుబ్బారావు, సీతావెంకటసుబ్బయ్య, ఆర్.రామక్రిష్ణ, చలపతి, సీతాబాలాజీ, జనార్ధన్ బాబాయి, వంశీ, పవన్ పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో కేక్ కట్ చేస్తున్న సీఎం.సురేశ్‌నాయుడు

గోపవరం..: చంద్రబాబు మరోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో మండలంలోని స్వయంభు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం బద్వేలు మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలరు ధనలక్ష్మి, టీడీపీ నాయకులు జీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో 1016 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంగలరెడ్డి, సుధాకర్‌రెడ్డి, 19వవార్డు ఇన్‌ఛార్జ్ మిత్తికాయల రమణ తదితరులు పాల్గొన్నారు.

చాపాడు..: మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యేగా పుట్టా సుధాకర్‌యాదవ్ గెలవడంతో మండలంలోని చిన్నవరదాయపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు కర్నూలుజిల్లాలోని అహోబిలంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామికి 101 టెంకాయలు కొట్టి శనివారం మొక్కుబడి తీర్చుకున్నారు. వెంకటసుబ్బయ్య, నాగరాజు, వెంకటేష్, ఓబులేసు, రామలక్ష్మణ్, నవీన్, రవితేజ మొక్కుబడి తీర్చుకున్నారు.